వంతెన కష్టం.. పట్టని యంత్రాంగం!

- రైల్వే బ్రిడ్జి కింద మూడడుగుల మేర వర్షపు నీరు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ప్రజలకు తప్పని అవస్థలు

గుంతకల్లు రూరల్: మండలంలోని ఓబుళాపురం పంచాయతీ ప్రజలకు రైల్వే బ్రిడ్జి కష్టాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. బ్రిడ్జి కింద భాగంలో మూడు అడుగుల మేర వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పొలం పనులకు వెళ్లే రైతులు, బ్రిడ్జి కిందగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓబుళాపురం గ్రామానికి సమీపంలో ఉన్న రైల్వే గేట్‌ను తొలగించిన రైల్వే అధికారులు అక్కడ గత కొన్ని సంవత్సరాల క్రితం రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జి కింద భాగంలో చేరే వర్షపు నీరు వెళ్లడానికి ఒక మార్గాన్ని కూడా ఏర్పాటు చేశారు. కొంత కాలం పాటు ఆ మార్గాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వచ్చిన రైల్వే సిబ్బంది క్రమంగా ఆ పనిని విస్మరించారు. దీంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గంలో చెత్త, మట్టి అడ్డుగా పేరుకుపోయి, బ్రిడ్జి కింద భారీ మొత్తంలో నీటి చేరుతోంది. వర్షాకాలంలో దాదాపు మూడు అడుగుల వరకూ నీరు నిలవడంతో అటుగా వెళ్లే వాహనదారులు గత కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతూవస్తున్నారు.


బ్రిడ్జి కింద భారీగా నిలిచిన వర్షపు నీటిలో అవస్థలు పడుతూ వెళ్తున్న వాహనదారుడు

పొలాలకు వెళ్లాలంటే బ్రిడ్జిని దాటాల్సిందే..

ఓబుళాపురం పంచాయతీలోని మైనాపురం, మైనాపురం తండా గ్రామాలతో పాటు, మొలకలపెంట, మొలకలపెంట తండా, కొంగనపల్లి, శంకరబండ గ్రామాల ప్రజలు సైతం పని నిమిత్తం గుత్తికి వెళ్లాలంటే బ్రిడ్జి కింద భాగంలోనే ప్రయాణించాల్సి వస్తుంది. దానికితోడు ఓబుళాపురం గ్రామ పంచాయతీలోని 50 శాతం మంది రైతులకు బ్రిడ్జి అవతల వైపునే పొలాలు ఉండటంతో ఆ రైతులు వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బ్రిడ్జి కింద భాగంలో భారీగానిలిచిన నీటిలో వెళ్లేందుకు ఎద్దులు మొరాయిస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో అవస్థలు పడుతున్నారు. మరోవైపు సమీప గ్రామాల నుంచి గుత్తికి ప్రయాణికులను తీసుకెళ్లే ఆటోలు, ఆ దారిలో ప్రయాణించే ఇతర వాహనాల సైలెన్సర్లలోకి వర్షపు నీరు చేరి చెడిపోతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు బ్రిడ్జి నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎద్దులు ముందుకెళ్లడం లేదు..



“ రైల్వే బ్రిడ్జి అవతల వైపు నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. రైల్వే బ్రిడ్జి కింద భాగంలో వర్షపు నీరు ఎక్కువ ఉన్న సమయంలో ముందుకు వెళ్లడానికి ఎద్దులు మొరాయిస్తున్నాయి. ఆ సమయంలో కిందకు దిగి నడుస్తూ ఎద్దులను ముందుకు తీసుకెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.

– వెంకటేష్, రైతు, ఓబుళాపురం

తరచూ మొరాయిస్తున్న ఆటో



ఆటో నడుపుకుంటూ భార్యాపిల్లలను పోషించుకుంటున్నాను. ఓబుళాపురం నుంచి గుత్తి వెళ్లే దారిలో ఓబుళాపురానికి ఆనుకొని ఉండే రైల్వే బ్రిడ్జిలో భారీగా వర్షపు నీరు నిలువ ఉండటం వల్ల ఆ నీరు ఆటో సైలెన్సర్‌లోకి ఇతర భాగాల్లోకి చేరి తరచూ ఆటో మొరాయిస్తోంది. రోజంతా ఆటో నడిపితే వచ్చే డబ్బుతో కుటుంబ పోషణకే కష్టంగా ఉన్న తరుణంలో ఆటో రిపేరీ మరింత భారంగా మారింది.

–ఆటో డ్రైవర్ రాజశేఖర్

సమస్య పరిష్కరించాలి



రైల్వే బ్రిడ్జి కింద ఏడాది పొడవునా నీటి నిలువ ఉండటంతో వాహనదారులతోపాటు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. వర్షపు నీరు బయటకు వెళ్లే దారిలో చెత్త పేరుకుపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

–రమేష్‌రెడ్డి, ఓబుళాపురం సర్పంచ్

‘తల్లికి వందనం’ వర్తింపజేయాలి

గుంతకల్లుటౌన్: ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింజేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నరసయ్య డిమాండ్ చేశారు. బుధవారం పీహెచ్ వర్కర్లు మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అరకొరగా చెల్లిస్తున్న వేతనాలతో కుటుంబపోషణ భారమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ పీహెచ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, కార్మికులకు ఇంక్రిమెంట్ అరియర్స్ చెల్లించాలన్నారు.అనంతరం మున్సిపల్ మేనేజర్ రాధకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు జగదీష్, వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రంగనాయకులు, నాయకులు ప్రేమ్‌కుమార్, గజేంద్ర, రవి, హనుమంతు, నారాయణస్వామి, దాస్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: మున్సిపల్ కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు డిమాండ్ చేశారు. గుత్తి మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం తమ డిమాండ్లను పరిష్కారం చేయాలని మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య, ఇంజినీరింగ్ , వాటర్ వర్క్ వర్కర్లు ఆందోళన చేపట్టారు. యోగా చేస్తూ వినూత్నంగా నిరసన తెలియజేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ అధికారులకు అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, రామాంజి, ఉపాధ్యక్షులు మహేష్, సీనియర్ నాయకులు రాజా, ఆది పాలొన్నారు.


గుంతకల్లులో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

యల్లనూరు: బాకీ డబ్బు చెల్లించాలంటూ దళిత వ్యక్తిని కరెంటు స్తంభానికి కట్టేసి కొట్టిన నిందితులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణునారాయణ, పూల ప్రసాద్ కోరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు బుధవారం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శింగవరం గ్రామానికి చెందిన దళిత కులానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ఎస్ కొత్తపల్లికి చెందిన గణేష్‌నాయుడు అనే వ్యక్తికి వ్యాపారం విషయంలో మనస్పర్థలు వచ్చాయన్నారు. డబ్బు బాకీ ఉన్నాడని చెప్పి శేఖర్‌ను గణేష్‌నాయుడుతో మరికొందరు కరెంటు స్తంభానికి కట్టేసి కొట్టినట్లు బాధితుడు చెబుతున్నాడన్నారు. పోలీసులు స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, యల్లనూరు ఎంపీటీసీ తిమోతి, గార్లదిన్నె నాగరాజు, వడియంపేట అంజి, వాసాపురం నాగభూషణం , యల్లనూరు పక్కీరప్ప, కందికాపుల సూరి, రామయ్య, శ్రీరాములు,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణునారాయణ, పూల ప్రసాద్

‘పాలిటెక్నిక్’లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీరాస్వామి బుధవారం తెలిపారు. పాలిసెట్– 2025లో ర్యాంకు సాధించిన వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ250, ఓసీ, బీసీలు రూ.700 ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రసీదుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ సెట్‌లతో ఈనెల 21 నుంచి 28 వరకు జరిగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్ ఇస్తామని తెలిపారు. ఎస్టీ, స్పెషల్ కేటగిరీ విద్యార్థులు నిర్ణయించిన తేదీల్లో విజయవాడలో హాజరు కావాలన్నారు. వివరాలకు హెల్ప్‌లైన్ 7901620198, 9493773778 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాలని, తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో చేపట్టారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి ర్యాలీగా గాంధీ సర్కిల్ వద్దకు వెళ్లారు. అక్కడ రోడ్డుపై బైఠాయించారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ జెడ్ వీరారెడ్డి, బీసీ కాలనీల్లో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని, వెంటనే రోడ్లు నిర్మించాలన్నారు. రద్దీగా ఉండే దాసరి కాలనీలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రామకృష్ణ, ఓబులేసు, రేణుక తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న దృశ్యం

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి

పెద్దవడుగూరు : ఖరీఫ్ సీజన్ లో పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని గుత్తి ఏడీఏ వెంకటరాముడు, ఏఓ మునికృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని కాశేపల్లి, విరుపాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో భూసార పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా ఎరువులు వాడుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. పంట మార్పిడి ద్వారా కలిగే లాభాలను తెలియజేశారు. పత్తి పంట సాగు చేసిన రైతులు గులాబీ రంగు పరుగు నివారణపై దృష్టి సారించాలని సూచించారు. పురుగు ఉధృతిని తగ్గించడానికి పొలంలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుత్తి ఏడీఏ వెంకటరాముడు

ప్రజా సమస్యలు పరిష్కరిద్దాం

పెద్దపప్పూరు: గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటని పరిష్కరిద్దామని తహసీల్దార్ బాలాజీరాజు అధికారులను కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపంచారు. వైస్ ఎంపీపీ కళావతి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. సభ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని ఎంపీడీఓ శకుంతల తెలిపారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ బాలాజీరాజు

ఉపాధ్యాయులకు సత్కారం

యాడికి: నగరూరు ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఐదుగురు ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల హెచ్‌ఎం కుళ్లాయప్ప ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు శ్రీనివాసయాదవ్ యాడికి ఉన్నత పాఠశాలకు, బయాలజీ ఉపాధ్యాయుడు మార్కస్ గుత్తి మండలం అబ్బేదొడ్డి ఉన్నత పాఠశాలకు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు కేశవ నాయుడు పీఎస్ హెచ్‌ఎం జక్కలచెరువుకు, పీడీ మహబూబ్‌బాషా అమ్మలదిన్నె ఉన్నత పాఠశాలకు, గణిత ఉపాధ్యాయుడు రమణ బత్తలపల్లి ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, నరేంద్ర, కుళ్లాయప్ప, గోపాల్,సావిత్రి, రఘు రామయ్య, స్వరూప రాణి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలపై నిఘా ఉంచండి


సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ రామసుబ్బయ్య

పెద్దపప్పూరు: ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐ రామసుబ్బయ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఏ చిన్న విషయం జరిగినా సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె: కల్లూరు పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం పెద్దవడుగూరు మండలం కొండూరుకు చెందిన 2 ట్రాక్టర్లు, అనంతపురానికి చెందిన ఒక ట్రాక్టర్ పెన్నానది నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. డీఎస్పీ వెంకటేషులు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పామిడి తహసీల్దార్‌గా షర్మిల



పామిడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా షర్మిల బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్ శ్రీధర మూర్తి కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయ ఏఓగా పనిచేస్తున్న షర్మిల ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆమెకు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళలపై దాడులను అరికట్టండి

గుంతకల్లు రూరల్: రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ అనంతపురంలో తన్మయి అనే అమ్మాయిని ఓ యువకుడు ప్రేమ పేరుతో నమ్మించి దారుణంగా హత్య చేశాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు సరైన రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

‘శ్మశాన వాటిక స్థలం ఆక్రమించారు’


సమాధులను తొలగిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని శివాలయం వద్దనున్న హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు రాజకీయ నాయకులు ఆక్రమించారని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. హిందూ శ్మశాన వాటిక పునఃనిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. శ్మశాన వాటిక మొత్తం స్థలం 16.48 ఎకరాలు ఉండగా కబ్జాతో 6 ఎకరాలు మాత్రమే మిగిలిందన్నారు. ఈస్థలాన్ని పార్కులా మార్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మృతి చెందిన వారిని పూడ్చిపెట్టి సమాధులను కట్టడం మూఢ నమ్మకమని, మృతి చెందిన వారిని కరెంట్ సాయంతో కాల్చి బూడిదను పూడ్చడయో, పుణ్య నదుల్లో కలపడమో చేయాలని కోరారు. అంతకుమునుపు ఆయన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతు మృతికి ఘన నివాళి

గుంతకల్లు రూరల్: నల్లదాసరపల్లికి చెందిన రైతు నాగలింగ ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో బుధవారం గ్రామస్తులు ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు. ఏఓ లీనా వసుంధర నాగలింగ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగలింగ పేరున 3.92 ఎకరాల భూమి ఉండగా భార్య, ఇద్దరు కుమారుల పేరున 13.71 ఎకరాల భూమి ఉందన్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి మెలిసి వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. మూడేళ్లుగా మిరప సాగు కలిసి రాకపోవడం, దానికితోడు వ్యవసాయ ఖర్చులతో కలిసి రూ.15 లక్షల వరకూ అప్పులు అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి నివాళి

పామిడి: పామిడిలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక బీసీసీ రోడ్డులోని ఝాన్సీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

క్లుప్తంగా

వేతనాలు పెంచండి


నిరాహారదీక్ష చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు కనీసం వేతనం రూ.29,200 చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం మున్సిపల్ ఆఫీసు ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు రిలేదీక్షలు చేపట్టారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమానవేతనాలివ్వాలని, లేని పక్షంలో ఈ నెల 22 నుంచి సమ్మె చేస్తామన్నారు. జేఏసీ సహాయ కార్యదర్శి సురేంద్ర, నాయకులు లక్ష్మీనారాయణ, సుంకన్న, మస్తాన్, హనుమంతు, మాణిక్యం పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ మొత్తం ఒకేసారి ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

యల్లనూరు: అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల మొత్తాన్ని ఒకేసారి రైతులకు అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఈమేరకు బుధవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని అన్నారు. అలాగే స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు గోపాలకృష్ణ, నాయకులు బాబు, వీరయ్య, పుట్లూరు మండల ఉపాధ్యక్షులు చిన్నకృష్ణయాదవ్, అంకెరామయ్య, మారుతి, శ్రీరాములు, నారాయణస్వామి, కంబగిరి పాల్గొన్నారు.

రామిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

పెద్దవడుగూరు: మండల కేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ రామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్, సీనియర్ నాయకులు నారాయణ, సూర్యనారాయణ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేశవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో రామిరెడ్డి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు రామిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఆటో నగర్‌లో బుధవారం కొండప్పకు చెందిన సుదర్శన్ ఆటోమొబైల్(లారీ స్పేర్‌పార్ట్స్) షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. షాపు నుంచి దట్టమైన పొగలు రావడంతో స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఘటనలో దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

350 మంది గుర్తింపు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ పరికరాల కోసం ప్రత్యేక గుర్తింపు శిబిరం జరిగింది. తాడిపత్రి నియోజక వర్గం నుంచి దాదాపు 350 మంది లబ్ధిదారులు వచ్చారని జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం ఆర్‌హెచ్‌ఓ నాగముని తెలిపారు. శిబిరానికి ప్రోగ్రాం ఆఫీసర్ షఫీ, సిబ్బందితో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆరుగురు టెక్నికల్ సిబ్బంది హాజరయ్యారన్నారు.

గడ్డివామి దగ్ధం


యాడికిలో కాలిపోతున్న గడ్డివామి

యాడికి: మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గడ్డివామి దగ్ధమైంది. వివరాలు..స్థానిక ఉన్నత పాఠశాల వెనుక వైపున ఉన్న కాలనీలో మదాసు రామిరెడ్డి పశువుల మేత కోసం 4 ట్రాక్టర్ల వేరుశనగ, జొన్న సొప్ప, వరిగడ్డిని కొనుగులో చేసి తన కల్లంలో నిల్వ చేసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. అయితే అప్పటికే వామి మొత్తం కాలిబూడిదైంది. ఘటనలో రూ.1.30 నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఫయాజ్‌బాషా


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఫయాజ్‌బాషా

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర నేత ఫయాజ్ బాషా కలిశారు. ఈ సందర్భంగా తాడిపత్రి రాజకీయ పరిస్థితులను అధినేతకు వివరించినట్లు ఫయాజ్‌బాషా తెలిపారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు.

21న రైల్వేగ్రౌండ్‌లో యోగా దినోత్సవం

గుంతకల్లుటౌన్: స్థానిక రైల్వే గ్రౌండ్‌లో ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. ఉదయం 6 నుంచి 7:30 గంటల వరకు జరిగే కార్యక్రమంలో పట్టణ ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి

గార్లదిన్నె: మండలంలోని రైతులు సబ్సిడీ డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని హార్టికల్చర్ ఆఫీసర్ రత్నకుమార్ సూచించారు. బుధవారం హెచ్ఓ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు 5 ఎకరాల వరకు ఉంటే 100 శాతం, 10 ఎకరాల వరకు భూమి ఉన్న ఇతర రైతులకు 90 శాతం సబ్సిడీతో 10 ఎకరాలు పైన భూమి ఉన్న రైతులు 50 శాతం సబ్సిడీపై డ్రిప్పులు, స్ప్రింక్లర్లు అందిస్తామన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట

పామిడి: పాళ్యం గ్రామంలోని ముత్యాలమ్మ గుడిలో బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితుని మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బాలిక అదృశ్యం

పెద్దపప్పూరు: దేవునిఉప్పలపాడు గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. గ్రామానికి చెందిన బాలిక బాలిక తల్లిదండ్రులు పొలానికి వెళ్లిన సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

హాస్టల్ భవనం మరమ్మతు


మరమ్మతు పూర్తయిన సంక్షేమ హాస్టల్ భవనం

సాక్షి ఎఫెక్ట్..

పామిడి: పట్టణ ఎద్దులపల్లి రోడ్డులోని బాలుర సంక్షేమ హాస్టల్ భవనాన్ని అధికారులు ఎట్టకేలకు మరమ్మతు చేయించారు. గతంలో సమస్యల లోగిళ్లలో బాలుర సంక్షమ హాస్టల్ అన్న శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. కలెక్టర్ వినోద్‌కుమార్ హాస్టల్ భవనం మరమ్మతు కోసం రూ.19 లక్షలు కేటాయించారు. దీంతో అధికారులు హాస్టల్ భవనాన్ని అన్ని వసతులతో తీర్చిద్దారు.

పక్కాగా రీ సర్వే


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి

యాడికి: గ్రామాల్లో భూముల రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేకు వెళ్లే ముందు రోజే సంబంధిత రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే రీసర్వే చేయించుకోకపోతే కల్గి ఇబ్బందులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. యంగన్నపల్లికి చెందిన శ్రీనివాసులు కొత్తపేట వైపునకు బైక్‌లో వెళుతుండగా ఎదురుగా లారీ వచ్చి ఢీ కొనింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.